


**దేవాలయ సమస్యలను పరిష్కరించి, ప్రతిష్టను కాపాడాలి**


ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

ఆదివారం | 10 మే , 2026 | పేజీలు : 03


# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం సహించం

## రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఆందోళనలు తప్పవు

## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

## లారీల కొరత,తరుగు కోతలు, మిల్లర్ల ఆంక్షలపై సిపిఐ నేతల ఆగ్రహం



**ప్రజాపక్షం/దేవరకొండ** : రైతులు రాత్రింబవళ్లు శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి నిల్వ ఉంచడం రైతాంగంపై జరుగుతున్న అన్యాయమని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మండిపడ్డారు. రైతుల ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం కొనసాగితే సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు తప్పవని ఆయన హెచ్చరించారు.శనివారం దేవరకొండ మండలంలోని ముదిగొండ (కమలాపురం) గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వల్లా నర్సింహారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశుల మధ్య రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లపై పెద్దఎత్తున ప్రకటనలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద లారీల కొరత, మిల్లర్ల నిర్లక్ష్యం, తూకాలలో అవకతవకలు, తరుగు పేరుతో ధాన్యంలో కోతలు వంటి సమస్యలు రైతులను నష్టాల్లోకి నెడుతున్నాయని అన్నారు.లారీల కొరత లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ధాన్యం రవాణాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తరుగు పేరుతో రైతుల ధాన్యంలో అక్రమంగా కోతలు విధిస్తే సహించబోమని హెచ్చరించారు. మిల్లర్లు ధాన్యం దిగుబడిలో అనవసర ఆంక్షలు విధించడం తగదని, లారీల్లో వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు.ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్న వారు, రైతుల ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వల్ల వర్షాలు వస్తే భారీ నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, చలివేంద్రాలు, నీడ పందిళ్లు, కూర్చునే సౌకర్యాలు వంటి కనీస వసతులు కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు దేపా సుదర్శన్‌రెడ్డి,రైతులు,గ్రామస్థులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం

### మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణ ప్రజల దశాబ్ధాల ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తాను కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఆయన సాగర్ రోడ్డుపై నూతనంగా నిర్మిస్తున్న డివైడర్ల పనులను ఆయన వన్ టౌన్, టు టౌన్ సీఐలు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఆయన పరిశీలించారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అదనపు సిబ్బంది అవసరమని గుర్తించి ఎమ్మెల్యే వెంటనే జిల్లా ఎస్పీతో ఫోన్ మాట్లాడారు. మిర్యాలగూడకు అవసరమైన అదనపు పోలీస్ సిబ్బందిని వెంటనే కేటాయించాలని కోరారు. కేవలం జరిమానాలు విధించడం కాకుండా ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా వ్యాపారాస్తులు నిర్ధేశిత పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే నా మొదటి ప్రాధాన్యత అని ట్రాఫిక్ రద్దీని తగ్గించి సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలు కూడా నిబంధనలను పాటించి అధికారులకు సహకరించాలని కోరారు.

## ఎటిఎంలో చోరీకి ప్రయత్నించిన ఇద్దరు నిందితుల అరెస్ట్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దామరచర్ల ఏటీఎంలో చోరికి ప్రయత్నించిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాత్ తెలిపారు. శనివారం సాయంత్రం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం రామాపురం గ్రామం, ప్రస్తుతం జడ్చర్ల స్నేహ ఫుడ్స్‌లో సూపర్‌వైజర్‌గా ఉన్న మోతుకూరి రమణ, అందులోనే సెక్యూరిటి గార్డ్‌గా ఉన్న ఏపీ రాష్ట్రానికి చెందిన వేరే మోహనకుమార్‌రెడ్డి ఇద్దరు కలిసి వైటీపీఎస్‌లో ఉద్యోగం కోసం దామరచర్లకు వచ్చి ఆర్థిక ఇబ్బందులతో ఉన్న వారు ఏటీఎంలో చోరి ఎలా చేయాలో చూసి ఏప్రిల్ 23న రాత్రి 11.30గంటలకు ఏటీఎంలోకి ప్రవేశించి షట్టర్ దించి మిషన్ పగులగొట్టే యత్రం చేయగా సెక్యూరిటి అలారం మోగడంతో పరారయ్యారు. పోలీసులకు దొరక్కుండా ఉండాలని జడ్చర్లలో సెక్యూరిటి గార్డులుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఏటీఎంలోని సీసీ కెమెరా ఫుటేజీ పోలీస్ స్టేషన్‌లకు సర్క్యులేట్ చేయగా రమేష్ గుర్తించి వాడపల్లి ఎస్ఐకు సమాచారం ఇచ్చారు. శనివారం రామాపురంకు వచ్చి అద్దె ఇంట్లోని సామాను తీసుకోని వెళ్తున్నారని సమాచారం రావడంతో వాడపల్లి పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. నిందితులిద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా జ్యుడిషియల్ కస్టడీకి తరలిస్తూ జేఎఫ్‌సీఎం ఆదేశాలిచ్చారు. నిందితులిద్దరి నుంచి ఇనుపరాడ్డు, స్మార్ట్ ఫోన్, నల్లటి కాలేజి బ్యాగ్ స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు సూచనలతో సీఐ ప్రసాద్, వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎస్ఐ జోజి, కానిస్టేబుల్ సైదులు, హోంగార్డులు సంతోష్‌రెడ్డి, యాదగిరిలను జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.



## జనగణనకు పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జనగణనకు ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు సరైన సమాచారం ఇచ్చి సహకరించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కోరారు. జనగణన అన్ని రకాల అభివృద్ధికి ముఖ్యమని,జనగణలో ప్రతి కుటుంబం వారి వివరాలను తెలియజేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జనగణనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించి ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని శనివారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జండా ఊపి ప్రారంభించారు. 2027 జనగణనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మొదటి విడత సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేపట్టడం జరిగిందని, అది ఈ నెల 10 తో ముగుస్తుందని, ఈ నెల 11 నుండి హౌస్ లిస్టింగ్, జనగణన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, జనగణనకు జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని చర్యలు చేపట్టిందని,ఈ నెల 11 నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వచ్చి జనాభా వివరాలు సేకరిస్తారన్నారు. జనాభా వివరాల సేకరణ కేవలం జనాభా లెక్కలకు ఉద్దేశించి మాత్రమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రచారరథం జిల్లాలోని 33 మండలాల పరిధిలో పర్యటించి జనగణనపై ప్రజలకు అవగాహన కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,సిపిఓ శ్రీనివాస్ నాయక్ ,జిల్లా అధికారులు పాల్గొన్నారు.





## మన సంస్కృతికి బొడ్రాయి పండుగలే ప్రతీక



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మన పూర్వీకుల నుండి వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చిన్నగారకుంట తండలో నిర్వహించిన నూతన బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీరాములు, వెంకన్న, ఎల్లారెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, ధరావత్ నగేష్, ధరావత్ అశ్విని, నాగరాజు, నీలమ్మ, భీమ్లా, శ్రీను పాల్గొన్నారు.

**గ్రామస్తులంతా సుఖసంతోషాలతో ఉండాలి...**

గ్రామస్తులంతా సుఖసంతోషాలతో ఉండాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఆకాంక్షించారు. శనివారం మండలంలోని చిన్నగారకుంట తండ నూతన బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆయన హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని, అందరిపై భగవంతుడి ఆశీస్సులు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మామిడి వెంకన్న, బండి రామకృష్ణారెడ్డి, ధరావత్ సూర్యం, ఆలయ కమిటి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## గౌడ సంఘం జిల్లా యువజన అధ్యక్షుడిగా కొండ సాయిరాంగౌడ్

**ప్రజాపక్షం/నడిగూడెం:** గౌడ సంఘం జిల్లా యువజన అధ్యక్షునిగా మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన కొండా సాయిరాంగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గట్టు నరేష్‌గౌడ్ అధికారిక నియామకపత్రాన్ని జారీ చేశారు. గౌడ యువతను సంఘటితం చేయడంలో సాయిరాంగౌడ్ చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్ర కమిటి ఈ బాధ్యతలను అప్పగించిందన్నారు. రాష్ట్ర కమిటి సహాయ కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి పొలంపల్లి అశోక్ కుమార్‌గౌడ్ సూచనల మేరకు ఈ నియామకం జరిగిందన్నారు. జిల్లాలో గౌడ సంఘం బలోపేతానికి, కుల బాంధవుల సమస్యల పరిష్కారానికి సాయిరాం గౌడ్ నాయకత్వం దోహదపడుతుందని అన్నారు. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు గట్టు నరేష్‌గౌడ్, జిల్లా ఇన్‌ఛార్జి పోలంపల్లి అశోక్‌కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని చిన్నగారకుంట తండ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట (నాబి శిలా పండుగ)ను గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగవంతుడి ఆశీస్సులతో గ్రామంలోని ప్రజలు పాడిపంటలతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్ రావు, డిసిసి ప్రధాన కార్యదర్శి పిన్నెని కోటేశ్వరరావు, సర్పంచ్ వసంత శ్రీను నాయక్, సర్పంచులు నాతాల వెంకట్ రెడ్డి, రవీందర్ నాయక్, బానోతు చందులాల్, ధరావత్ వీరన్న నాయక్ పాల్గొన్నారు.

## కంఠమహేశ్వరస్వామి వార్షిక మహోత్సవాలు

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని సిరిపురం గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవమైన శ్రీ కంఠ మహేశ్వర సురమాంబ దేవి తొమ్మిదవ వార్షిక మహోత్సవాలు ఈనెల 13 నుండి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గౌడ సంఘ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న మాలదారణ, 14న కంఠ మహేశ్వరుని చరిత్ర కథ, 15న జల బిందెలతో అభిషేకం, 16న సురమాంబదేవి నాటకం, 17న గంపలతో బోనాలు సమర్పణ, రాత్రి కళ్యాణం, బలిహరణతో ఉత్సవాలు ముగుస్తున్నట్లు భక్తులు తెలిపారు. ఈసందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



# ప్రతి నిరుపేదకు పక్కా ఇల్లు



**ప్రజాపక్షం/చివ్వెంల :** ఇండ్లు లేని ప్రతి నిరుపేదకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గుంజలూరు గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్‌తో కలిసి ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు పెద్ది ధనమ్మ నర్సయ్య గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తామని చెప్పి పదేండ్లు ఊరించిన గత ప్రభుత్వం ఒక్కరికైనా పక్కా ఇల్లు ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్ళలో ప్రతి నియోజక వర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో మరింత మంది పేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొల్లి కొండ సైదులు, ఉపసర్పంచ్ దొనకొండ పావని మహేష్, వార్డు సభ్యులు కొప్పు సైదులు, కొనకంచి మల్లయ్య, పెదపోలు చందన, చింతమల్ల రమేష్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, సుంకరి ఉపేందర్, గుగులోతు నాగు నాయక్, పడిదల రవి కుమార్, దొనకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సిబ్బంది కుటుంబాలకు కొంత సమయాన్ని కేటాయించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పోలీసు సిబ్బంది వారి కుటుంబాలకు కొంత సమయాన్ని కేటాయించి పిల్లల చదువులు వారి లక్ష్యాలలో దిశా నిర్ధేశం చేస్తూ ఉండాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ తెలిపారు. సూర్యాపేట రూరల్ సర్కిల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ చల్లా యాదగిరి కూతురు యామిని ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌కు ఎంపికైంది. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ యాదగిరిని, సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన యామిని ని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు శాఖ నందు విధులు నిర్వర్తిస్తూ సిబ్బంది ఎలాంటి పని ఒత్తిడి ఉన్నా కుటుంబాలకు సమయాన్ని కేటాయించి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారని, వారి భవిష్యత్తుకు మంచి బాటలు వేస్తున్నారని ఆయన అభినందించారు. ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌కు ఎంపికైన యామినిని పరీక్షలకు సన్నద్ధమైన విధానాన్ని, శిక్షణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని, మరిన్ని ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారికి మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీసు సంక్షేమ ఆర్‌ఎస్‌ఐ సాయిరాం, సిబ్బంది ఉన్నారు.



## ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** బీబీనగర్ పట్టణంలోని భవిష్ డయాగ్నొస్టిక్ సెంటర్ నందు శ్రీ ఆర్కే హాస్పిటల్, చావా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ ఆర్కే హాస్పిటల్ చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించు పల్లెకి వైద్యం కార్యక్రమంలో భాగంగా 138వ ఉచిత వైద్య శిబిరం బీబీనగర్ పట్టణంలోని భవిష్ డయాగ్నొస్టిక్ సెంటర్ నందు నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరం నందు బీబీనగర్ పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు బిపి షుగర్ టెస్ట్‌లు నిర్వహించి డాక్టర్ సలహా మేరకు వారికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరం నందు డాక్టర్ చావా రాజ్ కుమార్ జనరల్ ఫిజీషియన్, డాక్టర్ చావా అశ్లేష దంత వైద్య నిపుణులు ప్రజలకు మధ్య పరీక్షలు నిర్వహించి చేశారు.

## బిజెపిలో చేరికలు

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు సమక్షంలో తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బోర జలంధర్, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, కాంగ్రెస్ పార్టీ గానుగుబండ పదోవార్డు మెంబర్ గుండగాని మల్లేష్ ఆధ్వర్యంలో పలువురు బిజెపి పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ గ్రామ అధ్యక్షుడు శీలం లింగయ్య, సింగిల్ విండో డైరెక్టర్ ఎనగందుల రామచంద్రు, గుండగాని పరమేష్, కట్ల కొండయ్య, జలగం ఉపేందర్, తునికి మల్లమ్మ, సతీష్ పాల్గొన్నారు.



## తెలంగాణలో బిజెపి జెండా ఎగరడం ఖాయం

**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నేరేడుగొమ్ము భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు నాగిళ్ళ ఆంజనేయులు ఆధ్వర్యంలో శనివారం తిమ్మాపురం గ్రామంలో మండల పార్టీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా బిజెపి రాష్ట్ర నాయకులు కేతావత్ లాలునాయక్ పాల్గొని మాట్లాడుతూ మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న బిజెపి భారీ బహిరంగ సభకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరు కానున్న నేపథ్యంలో ఈ జనగ్రహ సభను విజయవంతం చేసేందుకు దేవరకొండ నియోజకవర్గం,ఉమ్మడి చందంపేట, నేరేడుగొమ్ము మండలాల నుండి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు వనం నరేందర్‌రెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, నేరేడుగొమ్ము సీనియర్ నాయకులు రాజు, లింగయ్య పాల్గొన్నారు.




## ప్రజానాట్యమండలి మూడవ మహాసభలను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** ఈనెల 20వ తేదీన ఆలేరులో జరిగే తెలంగాణ ప్రజానాట్యమండలి మూడవ మహాసభలను విజయవంతం చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేశం అన్నారు. మండలంలోని పెద్ద పర్వతాపురం గ్రామంలో ప్రజానాట్యమండలి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రజానాట్యమండలి మండల అధ్యక్షులుగా రెడ్డబోయిన మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా పిట్టలశంకర్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందని కళాకారులకు వృద్ధాప్య పెన్షన్ హెల్త్ కార్డులు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేశం, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షురాలు ఇంజ యమల, రాజప్ప నరేష్ లింగం ఆంజనేయులు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అధ్యాపకుల ప్రచారం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పదవ తరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి చదువుకోవాలని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వెంకటరమణ అన్నారు. శనివారం నేరుడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు మండలాల్లో అధ్యాపకులు మూడు బృందాలుగా ఏర్పడి ఆయా గ్రామాలలో తిరుగుతూ పదవ తరగతి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గత సంవత్సరం మా కళాశాలలో చదివి మంచి ఫలితాలు సాధించారని అన్నారు. ప్రభుత్వం కళాశాలలకు అందిస్తున్న వసతులు, సౌకర్యాలతో కూడిన కరపత్రాలు ముద్రించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మద్దిమడుగు సైదులు, ప్రణతి, కెఎల్‌ఎన్‌రావు, శ్రీనివాసులు, వెంకన్న, అంజయ్య, సునిత, నర్సింహాచారి, గణేష్, ప్రసాద్, వీరు, అపర్ణ, వీరేష్ పాల్గొన్నారు.

## కంఠమహేశ్వర స్వామి ఆలయంలో పూజలు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలం చందుపట్ల గ్రామంలో గౌడ కులస్థుల ఆరాధ్య దైవ్యం శ్రీ శ్రీ శ్రీ కంఠమహేశ్వర స్వామి సురమాబ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే భువనగిరి మాజీ శాసన సభ్యులు పైళ్ళ శేఖర్ రెడ్డి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గుడి నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ భువనగిరి మండల అధ్యక్షుడు, తుక్కాపురం సర్పంచ్ జనగాం పాండు, మాజీ ఎంపీపీ కేశపట్నం రమేష్, మాజీ జెడ్పిటిసి సుబ్బురు బీర్ మల్లయ్య, చందుపట్ల పిఏసిఎస్ బ్యాంకు మాజీ చైర్మన్ బాల్గురి మధుసూదన్ రెడ్డి, చందుపట్ల గ్రామ సర్పంచ్ కంకల లలిత కిష్టయ్య, సర్పంచుల ఫొరం భువనగిరి మండల అధ్యక్షుడు, జక్కా రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపును సద్వినియోగం

**ప్రజాపక్షం/మర్రిగూడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను మండలంలోని ఆరవ తరగతి నుండి 9 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సద్వినియోగము చేసుకోవాలని మర్రిగూడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉయ్యాల వెంకటేశం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కార్యక్రమాలలో విద్యార్థులకు డ్రాయింగ్, సంగీతము, పాటలు, యోగ, చిత్రలేఖనము, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్, బేసిక్స్ వంటి పలు అంశాలలో 11నుండి 25 వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని విద్యార్థులలో ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడుతుందని తల్లిదండ్రులు శ్రద్ధ వహించి పిల్లలను కార్యక్రమాలకు పంపించాలని కోరారు.

## వేసవి శిబిరం

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని రాంపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు వేసవి శిబిరం (సమ్మర్ క్యాంప్) ఈ నెల 11న సోమవారం నుండి నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ అంబటి శోభా రాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వేసవిలో విద్యార్థులకు సంగీతం, నాట్యం, చిత్ర లేఖనం, కథలు చెప్పడం, చెస్, కారమ్స్ లాంటి అంశాలలో విద్యార్థులకు నైపుణ్యం పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేసిందని, విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నామని, మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు రేపటినుండి 15 రోజులపాటు జరిగే వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిఎం శ్రీ జిల్లా పరిషత్ పాఠశాల పోచంపల్లి ప్రధానోపాధ్యాయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 శిక్షణలో విద్యార్థినీ, విద్యార్థులకు యోగ, ఇండోర్ గేమ్స్ గణితం, స్పోకెన్ ఇంగ్లీష్, సింపుల్ సైన్స్ ఎక్స్పెరిమెంట్స్, జీకేపోటీలు, డాన్స్ కళలు, క్రాఫ్ట్స్ నేర్పించబడినట్లు తెలిపారు.

## 12 హనుమాన్ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల పరిధిలోని నారాయణపురం సిరిపురం గ్రామాల మధ్య వేంచేసియున్న శ్రీదాసాంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 12న మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటి నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అదే రోజున జై హనుమాన్‌జై శ్రీరామ్ నినాదంతో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఎంజియు ఫార్మసీ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకుల భర్తీ నోటిఫికేషన్ విడుదల

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటైన ఫార్మసీ కళాశాలలో ఆర్ట్ టైం అధ్యాపకుల నియామకానికి శనివారం రిజిస్టర్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. ఫార్మకాలజీ, ఫార్మ కాప్నిసిస్, ఫార్మసిటికల్ కెమిస్ట్రీ, ఫార్మసిటిక్స్ సబ్జెక్టులలో పీహెచ్డీ,నెట్,గేట్,జి పాట్ బోధన అనుభవం కలిగి న అభ్యర్థులు తమ దరఖాస్తులను మే 15 లోగా సమర్పించాలని ఆయన తెలిపారు.

## ఘనంగా భీమిరెడ్డి నర్సింహారెడ్డి 18వ వర్ధంతి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ఎంసిపిఐ(యు) నాయకులు కామ్రేడ్ భీమిరెడ్డి నర్సింహారెడ్డి 18వ వర్ధంతి శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పి వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, కౌన్సిలర్ డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్, బిఆర్ఎస్ నాయకులు నాతి సవీందర్ కుమార్, మారిపెద్ది శ్రీనివాస్, పెన్‌పహాడ్ మాజీ ఎంపిపి నెమ్మాది బిక్షం, ఉప్పల ఆనంద్, షేక్ భాషామియా, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న, జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి యం. డేవిడ్ కుమార్‌లతోపాటు పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం బిఎన్ చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు.

## ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/అనంతగిరి:** ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వాయిలసింగారం గ్రామంలో నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ వారు రైతులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా డిఈఆర్ రాంప్రసాద్, నడిగూడెం డిఈ ఆనంద్ లు మాట్లాడుతూ గ్రామ ఊర చెరువు కట్ట గత సంవత్సరం కురిసిన వర్షాలకు, వివిధ గ్రామాల చెరువుల నుండి వచ్చే వరదలకు, సాగర్ కాలువ నుండి వచ్చే నీటితో ఊరచెరువు నిండి వరద ప్రభావంతో చెరువు కట్ట దెబ్బతిన్నదని తెలిపారు. దీంతో ఆ చెరువు కట్టకు మరమ్మతులు చేయాలని పలువురు రైతులు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి దృష్టికి తీసుకరాగా ఆమె స్పందించి రూ.7.92 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. దీంతో చెరువు కట్టపై ఉన్న కంపచెట్లు, గుర్రపు డెక్క తొలగించుట, నీటి వినియోగం, తూముల మరమ్మతులు కింద ఉన్నటువంటి పంట కాలువల పూడికతీత పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందిగామ శ్రీనివాస్, ఎఈటి నిరంజన్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరావు, లాలు, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు గుండ్లపల్లి వెంకన్న, రేవూరి శ్రీను, వేముల పుల్లయ్య, కంటు కృష్ణ, కొల్లు సుబ్బారావు, డి.నాగరాజు, విజయ్, వీరయ్య, లస్కర్లు, రైతులు పాల్గొన్నారు.

**కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్లపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా : సర్పంచ్ నందిగామ శ్రీనివాస్**

గ్రామంలోని సర్పంచ్‌కు గాని, రైతులకు గాని చెప్పకుండా కాంట్రాక్టర్ చెరువు కట్ట మరమ్మతు పనులను ప్రారంభించి ఉపాధి హామీ పథకంలో గతంలో చెరువు కట్టకు నాటిన ఖర్జూర, ఈత చెట్ల మొక్కలను, విలువైన చెట్లను జెసిబి సాయంతో పికివేయించడం అన్యాయమని, భావితరాలకు ఉపయోగపడే మొక్కలను పీకి వేయించిన కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా చెరువు నుండి నీటిని తీసివేయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



## కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** కాంగ్రెస్ పార్టీపై నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అనుచిత వ్యాఖ్యలు చేయడాన్నీ ఆపార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసు పాదం ఖండించారు.శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు రాజకీయ భద్రత కోసం అభద్రతాభావంతో పద్ధతి లేకుండా మాట్లాడడం తగదన్నారు. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రజా సంక్షేమం కోసం నిరంతరం ప్రజల్లో ఉండి పనిచేస్తున్నాడని పేర్కొన్నారు.భారీ ఈదురు గాలులతో రైతులు అల్లాడిపోతుంటే కల్లాల వద్దకు వెళ్లి వారిని పరామర్శించి అత్యవసర సేవలు అందించారని గుర్తు చేశారు. ప్రజల కోసం ప్రశ్నించాలనుకుంటే ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే మంచిదన్నారు. కేంద్రాల్లో దాన్యం కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా జరుగుతుందన్నారు.మరో వారం రోజుల్లో కొనుగోలు పూర్తవుతుందని పేర్కొన్నారు.ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగాల వెంకన్న,యాస కరుణాకర్ రెడ్డి,కొండ వెంకన్న పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మండలంలోని గానుగుబండ గ్రామంలో నల్లు అమృతమ్మ నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు నల్లు చిత్తరంజన్ రెడ్డి జ్యోతి దంపతుల సహకారంతో కొత్తవాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. వాటర్ ప్లాంట్ రూమ్ దాత కంచర్ల కుశలవరెడ్డి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్లు చిత్తరంజన్ రెడ్డి దంపతులు నల్లు కవిత రెడ్డి, నల్లు అరుణ రెడ్డి, భారతి రెడ్డి, సర్పంచ్ మాతంగి వెంకటమ్మ కర్ణాకర్, మాజీ సర్పంచ్ నల్లు రాంచంద్ర రెడ్డి, మాజీ ఎంపిటిసి దుర్గయ్య, రాజేష్ పాల్గొన్నారు.



## ఘనంగా బిఎన్ వర్ధంతి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** సాయుధ తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి వర్ధంతి వేడుకలను శనివారం మండల కేంద్రంలో పూలే అంబేద్కర్ ఆశ పోరాట సమితి అధ్యక్షులు ఈదురు వీర పాపయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసం ఎల్లవేళలా పనిచేసిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన త్యాగాలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో కుమారి నాగరాజు, రాంబాబు, రమేష్ పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** నీటిని పొదుపుగా వాడుకోవాలని నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహమ్మద్ కురుషీద్ అన్నారు. శనివారం బీబీనగర్ మండల కేంద్రంలో చెరువు వద్ద రైతులకు గ్రామస్తులకు నీటిపారుదల అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా రైతు వారాన్ని పురస్కరించుకొని నీటి వినియోగంతో చెరువులోని పూడికతీత నీటి వల్ల జరిగే ప్రయోజనాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నీటిని పొదుపుగా వాడడం వల్ల త్రాగునీటి సాగునీటి కొరత ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎదుటి ఇంజనీర్ మొయినుద్దీన్, ఎర్రోళ్ల వెంకటస్వామి, రవికుమార్ పాల్గొన్నారు.

## చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండల కేంద్రంలో గల చెరువులో గుర్తుతెలియని వ్యక్తి చెరువులో దూకి మరణించిన సంఘటన శనివారం వెలుగులోనికి వచ్చింది. స్థానిక సీఐ ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సుమారు 30 నుండి 40 సంవత్సరాల వయసు గల వ్యక్తి సిమెంటు నల్ల రంగు కలిసిన నైట్ పాయింటు బ్లూ కలర్ టీషర్ట్ వేసుకొని ఉన్నాడని, మరణించిన వ్యక్తి ఆచూకీ కోసం బీబీనగర్ పోలీసులు సంపాదించవలసిందిగా ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు సిఐ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

## నరసింహ మృతికి నివాళులు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని నోముల గ్రామానికి చెందిన బాధిని నరసింహ అనారోగ్యంతో మృతి చెందారు.శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో గౌడ సంఘం అధ్యక్షుడు గుండగోని జంగయ్య గౌడ్,ఉపాధ్యక్షుడు కొప్పు వెంకటేశ్వర్లు,నాయకులు బాదినీ యాదయ్య,బాధినీ వెంకటరమణ,యరకలి అంజయ్య,రాచకొండ పాపులు,దిండుగాల సైదులు తదితరులున్నారు.

